క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ

ఖానాపురం : మండలంలోని రంగాపురం గ్రామపంచాయతీ కార్యదర్శిగా అబేద బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అశోక్‌నగర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న అబేద రంగాపురం గ్రామానికి రాగా అశోక్‌నగర్ గ్రామానికి వరంగల్ జిల్లాలో పని చేస్తున్న సీనియర్ పంచాయతీ కార్యదర్శిని నియమించినట్లు తెలిసింది.

నివాళి



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు సాతుపెల్లి ఉప్పలయ్య ఉద్యమాలే ఊపిరిగా ఎన్నో సేవలు అందించాడని ఆయన సేవలను మరిచిపోలేమని మండల సీపీఐ కార్యదర్శి ఆరెల్లి రవి అన్నారు. ఉప్పలయ్య సంస్మరణ సభను బుధవారం ఇల్లందలో ఏర్పాటు చేసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. లంక ఐలయ్య, వేణు, కడమంచి యాదగిరి, ఆరెల్లి ప్రభాకర్, కొడిశాల భిక్షపతి, బాలరాజు, సాయిలు, ఆనందం, వేణు, సారయ్య, ఎల్లమ్మ, సుజాత, పుష్ప, లక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఔదార్యం



చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన మేరపాకుల చంద్రశేఖర్ బైక్ మెకానిక్‌గా పని చేస్తు జీవనం గడుపుతున్నాడు. ఈ క్రమంలో గతేడాది రోడ్డు ప్రమాదానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. వారి పరిస్థితిని చూసి గుడ్‌షపర్డ్ ఉపాధ్యాయుడు ముదిగిరి అనిల్ యాదవ్ చంద్రశేఖర్ కుమారుడు నిహాన్‌ను దత్తత తీసుకొని ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు విద్యకు సంబంధించిన పూర్తి బాధ్యతను తీసుకున్నాడు. హెచ్‌ఎం జోసఫ్ విజయ్, శ్రావణ్‌కుమార్, రాంచందర్, రాజు, రత్నం, గ్రామస్తులు అభినందించారు.

హెచ్‌ఎంకు సన్మానం

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్‌లో హెచ్‌ఎంగా విధులు నిర్వహించి జిల్లా బాలికా విద్యాభివృద్ధి అధికారిగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లిన ఫ్లోరెన్స్‌కు బుధవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జన్నపురెడ్డి ఉమారాణి మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లుగా హెచ్‌ఎంగా విధులు నిర్వహించి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేశారన్నారు. అంతేకాకుండా రాష్ట్ర విద్యాశాఖ, ఎస్సీఈఆర్టీ ద్వారా ఉత్తమ పాఠశాలగా ఎంపిక కావడంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో విద్యార్థులు పాల్గొనే విధంగా ఫ్లోరెన్స్ కృషి చేసిందని కొనియాడారు. అలాగే జిల్లా బాలికా అభివృద్ధి అధికారిగా బాలికల విద్యకు పాటుపడాలని కోరారు. ఫ్లోరెన్స్ మాట్లాడుతూ.. ఉప్పరపల్లిని రాష్ట్రంలోనే ఆదర్శ పాఠశాలకు తీర్చిదిద్దడంలో సహకరించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ కాసాని రవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

నిందితుల అరెస్ట్

గీసుకొండ: విశ్వనాథపురం రెవెన్యూ పరిధిలోని ఆంగోత్ శ్రవణ్‌కుమార్, స్వామి అనే ఎస్టీ రైతు కుటుంబాల భూమిపైకి వెళ్లి దౌర్జన్యం చేసిన వారిని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు. ఈ కేసులో సవాయి శ్రీనివాస్, ఎలుక నాగరాజు, ఎస్‌కే సోహెల్, గండ్ల రాకేశ్‌లపై సోమవారం అట్రాసిటీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

వర్ధన్నపేట: ప్రేమజంట.. పెళ్లి చేసుకున్న అనంతరం తమకు రక్షణ కల్పించాలని కోరుతూ మంగళవారం రాత్రి పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం మండలంలోని కొత్తపల్లికి చెందిన తాళ్లపెల్లి రాకేశ్‌గౌడ్, అదే గ్రామానికి చెందిన బస్వ నిహారిక కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో తమ ప్రేమను ఇరుకుటుంబాలు అంగీకరించలేదు. దీంతో మంగళవారం గీసుకొండ మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పెళ్లి చేసుకుని తమకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఇరు కుటుంబాల పెద్దలను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించామని ఎస్సై తెలిపారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

శాయంపేట : గర్భిణులకు రక్తహీనత, పౌష్టికాహార లోపాలను నివారించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్లను అందిస్తుందని సర్పంచ్ ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో గల పల్లె దవాఖానలో బుధవారం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లును ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతతో కలిసి అందించారు.

మధ్యాహ్న భోజనం వండేదెట్లా?

- గవిచర్ల మోడల్ స్కూల్‌లో వంటగది లేక ఇబ్బందులు
- ఎండ, వానలకు అవస్థలు పడుతున్న నిర్వాహకులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



వంటగదిలేక రేకుల కింద వంట చేస్తున్న నిర్వాహకులు

సంగెం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటుగా విద్యార్థుల హాజరు శాతం పెంచాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకానికి వంట గదులు లేకపోవడంతో ఆరు బయటనే వండాల్సి వస్తోంది. గత పదేళ్లుగా ఎలాగో అలా నెట్టుకొచ్చిన నిర్వాహకులు ఎండాకాలం, వర్షాకాలంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గవిచర్లలోని మోడల్ స్కూల్‌లో వంట గది నిర్మించపోవడంతో ఏజెన్సీ నిర్వాహకులు నానా అవస్థలు పడుతున్నారు. మోడల్ స్కూల్‌లో ఆరుబయట వంట వల్ల వర్షాకాలంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆరుబయట వంటతో సమస్యలు..

ఆరుబయట వంట చేయడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వంట నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు ప్రస్తుతం 500మంది విద్యార్థులున్నారు. మోడల్ స్కూల్‌ను 2013లో ప్రారంభించగా నేటి వరకు వంట గది నిర్మించలేదంటే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై పాలకులు, అధికారుల వైఖరికి నిదర్శనంగా నిలుస్తుందనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. మండే ఎండలో, జోరువానలో వంట వండేందుకు తంటాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంట వండే సమయంలో వాన వస్తే సకాలంలో భోజనం తయారు చేయలేకపోతున్నామని ఏజెన్సీలు వాపోతున్నారు. వంటగది నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హామీ ఇచ్చి ఆరేళ్లు గడిచినా అమలు కావడం లేదు. హామీలే తప్ప అమలు ఏదని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

పునాది గోడకే పరిమితం..

మోడల్ స్కూల్‌లో వంట గది నిర్మాణానికి నిధులు మంజూరు కాగా అప్పటి సర్పంచ్ నిర్మాణానికి పునాదులు తవ్వి కొంత వరకు గోడలు కట్టి వదిలేశాడు. వంట గది నిర్మాణంపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు శ్రద్ధ లేకుండా పోయిందనడానికి నిదర్శనంగా నిలుస్తున్నది. వంట నిర్వాహకుల ఇబ్బందులు, విద్యార్థుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని మోడల్ స్కూల్‌తో మిగిలిన పాఠశాలల్లో వంట గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి వంట గదుల నిర్మాణం పూర్తి చేయాలని విద్యార్థులు, వారి తల్లితండ్రులు కోరుతున్నారు.

ఇబ్బందులు తొలగించాలి



మోడల్ స్కూల్ ప్రారంభమై పదేళ్లు అవుతుంది. అయినా వంట గది నిర్మాణంపై కమ్ముకున్న నీలినీడలు తొలగడం లేదు. గోడల వరకు నిర్మాణం చేసిన మాజీ సర్పంచ్ బిల్లు రాలేదని మిగిలిన పని పూర్తిచేయడం లేదు. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి ఇప్పుడైనా వంట గది నిర్మాణం పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలి.

- మందపురి బలరాం, ఎస్‌ఎంసీ చైర్మన్

వంట చేయలేకపోతున్నాం..



పాఠశాలలో నేటికి వంట గది లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఆరుబయట వంటతో ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయమేస్తున్నది. ఎండలో వంట చేయలేకపోతున్నాం. గాలి బాగా వీచినా ఇబ్బందిగానే ఉంది. గాలి వీస్తే మంట సరిగా మండక వంట ఆలస్యం అవుతున్నది. వానొస్తే మరి ఇబ్బందిగా ఉంది.

- రజిత, ఏజెన్సీ నిర్వాహకురాలు

కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే ధ్యేయం

ఎమ్మెల్యే అరూరి రమేశ్



చెక్కు అందజేస్తున్న అరూరి రమేశ్

వర్ధన్నపేట : పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలో ముందుకు సాగుతున్నామని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. మండలంలోని నల్లబెల్లి గ్రామానికి చెందిన కీర్తి హరీశ్, అంబల సమ్మక్క, నిమ్మాని రమేశ్ వైద్యచికిత్సల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.2.6లక్షల విలువ గల చెక్కులను బుధవారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో వైద్య చేయించుకోవడానికి పేదలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యేవారన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ రావాలంటనే అదో పెద్ద పైరవీ చేసి దళారులు కమీషన్లు తీసుకుని అరకొర అందించే వారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్ రాజేష్‌ఖన్నా, పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, ఎంపీటీసీ దుగ్యాల జ్యోతి మాధవరావు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలి



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

వర్ధన్నపేట : ప్రతీ ఒక్కరు ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని యూనియన్ బ్యాంక్ ఇల్లంద శాఖ మేనేజర్ నరేష్ అన్నారు. వర్ధన్నపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం ఎంఈఓ రంగయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి టీఎస్ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల వర్ధన్నపేటకు ం చెందిన విద్యార్థి రూ. 5 వేలు నగదుతో పాటు మెరిట్ సర్టిఫికెట్, రెండో బహుమతి జెడ్పీహెచ్‌ఎస్ ఇల్లందకు రూ.4000వేలు, మూడో బహుమతి జెడ్పీహెచ్‌ఎస్ వర్ధన్నపేట రూ. మూడు వేలు నగదుతో పాటు మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. హెచ్‌ఎం నర్సింహమూర్తి, భిక్షపతి, కౌన్సిలర్ కమలాకర్, కిషోర్‌కుమార్, హథీరాం, కవిత, షకీలా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నెక్కొండ: ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్మికులు



దుగ్గొండి: ఎంపీడీఓకు..

నెక్కొండ : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ పంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు భూక్యా నరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ పర్వేస్‌కైసర్‌కు ఆ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీ కార్మికుల వేతనాలు పెంచాలని, కేటగిరిల వారిగా జీతాలు ఇవ్వాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ట్రెజరీల ద్వారా వేతనాలు చెల్లించాలని ఆయన కోరారు. జూలై 5వరకు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. లేని 6నుంచి జేఏసీ పిలుపు మేరకు కార్మికులు సమ్మెకు వెళ్తారని ఆయన హెచ్చరించారు. సంఘం ఉపాధ్యక్షుడు ఈదునూరి సాయిలు, కోశాధికారి బర్ల రాజు, నాయకులు మదార్, శ్రీనివాస్, కృష్ణ, ఆదిరెడ్డి, జంపయ్య, సంతోష్, రాకేష్, నగేష్, హరీష్, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

దుగ్గొండి : సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు బుధవారం ఎంపీడీఓ కృష్ణప్రసాద్‌కు సమ్మె నోటీసు అందజేశారు. నెలకు రూ.19,000ల జీతం పెంచాలని, 500మంది జనాభాకు ఒక పారిశుద్ధ్య కార్మికుడిని నియమించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాదం రాజలు, పుట్టపాక రాజేందర్, ముస్కు రాజు, పొన్నం రమేష్, గంగాడి అశోక్ రెడ్డి, శ్రీరామోజు భిక్షపతి, లోనె తిరుపతి, పలువురు పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి ఫలాలు



ప్రజలకు అభివాదం చేస్తున్న దొంతి మాధవరెడ్డి

చెన్నారావుపేట : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదలకు అభివృద్ధి ఫలాలు అందుతాయని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు మండంలోని పుల్లయ్యబోడు తండా, బోజేర్వు గ్రామాలలో మంగళవారం రాత్రి హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా దొంతి మాధవరెడ్డికి ప్రజలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. పూలవర్షం కురిపించారు. పాదయాత్రలో ఇంటింటికి వెళ్త సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తరుగు సాకుతో ప్రభుత్వం రైతులను నట్టేటా ముంచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 70 కేజీ బస్తాకి కిలో తరుగు తీస్తే బీఆర్ఎస్ కేసీఆర్ ప్రభుత్వం 40కిలోల బస్తాకి 3కిలోల తరుగు క్వింటాకు 10కిలోల తరుగుని తీసి రైతు నడ్డి విరిచిందన్నారు. కేసీఆర్‌ను తరిమి కొట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. నిత్యావసర వస్తువులు, వంట గ్యాస్ రూ.1,200 పెంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నాయని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి ఆశీర్వదిస్తే మహిళలకు ఉచిత బస్‌పాస్ సౌకర్యంతో పాటు ఇందిరమ్మ భరోసాగా ప్రతి రైతుకు రూ.15,000 అందిస్తామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ భృతి, రుణమాఫీ, రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇలా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పాలాయి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి, ఓర్సు తిరుపతి, వేముల సాంబయ్య, మంద యాకయ్య, సిద్ధన రమేష్, తొప్పెట రమేష్, బిల్ల ఇంద్రసేనారెడ్డి, కుసుమ సతీష్, నూకల సాంబరాజు, సారయ్య, ఐలయ్య, రమేష్, సురేష్, సుదర్శన్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

పర్వతగిరి : రెండోవిడత దళితబంధు పథకం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించి, లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్, సీపీఐ మండల కార్యదర్శి పర్వతాల ఎల్లస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో అఖిలపక్ష ప్రజా సంఘాల సమావేశం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కులాలకు రూ.లక్ష రుణం కోసం లబ్ధిదారుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం దళితబంధు పథకం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరించకుండా దళితుల పట్ల వివక్షత చూపుతుందని విమర్శించారు. టీడీపీ మండల నాయకుడు కట్ట వీరభద్రయ్య, మాదాసి మాదాసి యాకుబ్, ఎన్నమనేని వెంకటేశ్వర్‌రావు, దొమ్మటి వీరస్వామి, తదుబ్బర సురేందర్ పాల్గొన్నారు.

ఘనంగా పీవీ నర్సింహారావు జయంతి



వర్ధన్నపేట: నివాళులర్పిస్తున్న అధ్యాపక బృందం



నర్సంపేట రూరల్: పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్సై, సర్పంచ్‌లు

వర్ధన్నపేట : పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా బుధవారం వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీవీ నర్సింహారావు 17భాషల్లో ప్రావీణ్యం ఉన్నవాడని, బహుముఖ ప్రజ్ఞాశాలి, భారత ఆర్థిక వ్యవస్థ పరిపుష్టికి ఎన్నో సంస్కరణలు చేపట్టిన మహనీయుడని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సమత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లిలోని పీవీ స్మారక మందిరంలో మాజీ ప్రధాని, బహుభాషా కోవిదుడు పీవీ నర్సింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లక్నెపల్లి సర్పంచ్ గోడిశాల రాంబాబు, కొడారి రవి, ఎస్సై సురేష్ పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి అనిత, పీవీ ట్రస్ట్ బాధ్యులు రవీంద్రశర్మ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య



సమావేశంలో మాట్లాడుతున్న బొట్ల కార్తీక్

నర్సంపేట : దేశాన్ని దోచుకుంటున్న బీజేపీ చేస్తున్న అరాచకాలు, అన్యాయాలను ఉన్నది ఉన్నట్లు ప్రజలకు చెబుతున్న జర్నలిస్టు తులసిచందుపై బీజేపీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని బీఎస్పీ రాష్ట్ర నాయకుడు బొట్ల కార్తీక్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడి చేస్తున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. జర్నలిస్టులకు బీఎస్పీ అండగా నిలుస్తుందని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మంద శ్యామ్ మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడే ఏకైక పార్టీ బహుజన సమాజ్ పార్టీ అన్నారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని బూత్ స్థాయిలో తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. మాసాని రమేష్, అల్లూరి శ్రీకాత్, తనుగుల శ్రీకాంత్, బస్కె అశోక్, పట్టణ నాయకులు శీరంశెట్టి రాజేందర్, బీవీఎఫ్ కన్వీనర్ ఈసంపెల్లి సందీప్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ



నల్లబెల్లి: బోనమెత్తిన జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, మహిళలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముగ్దుంపురం గ్రామంలో ముదిరాజ్ కులస్తులు బుధవారం పెద్దమ్మతల్లికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెండ్యాల జ్యోతి ప్రభాకర్, కుల పెద్దమనిషి రాజ్‌కుమార్, గొర్రె రవి, శ్రీను, తూటి రాజు, కోల రవి, సింగం భాస్కర్, గొర్రె భిక్షపతి, చాదరబోయిన యాదగిరి, సింగం ఐలయ్య, జంగం నర్సయ్య, ననుమాస రాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి బోనాలు

నల్లబెల్లి : ముదిరాజ్‌ల కులదైవం పెద్దమ్మతల్లి బోనాల పండుగను మండలంలోని నల్లబెల్లి, లెంకాలపల్లి, కొండాయిల్‌పల్లి గ్రామాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ముదిరాజ్ కులస్తులు అమ్మవారికి బోనాన్ని సమర్పించారు. ఈ ఉత్సవాలకు జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, ఎంపీపీ ఊడుగుల సునీత, శానబోయిన రాజుకుమార్, సర్పంచ్ నానబోయిన రాజారాం, లెంకాలపల్లి, కొండాయిల్‌పల్లి గ్రామాల సర్పంచ్‌లు మేకల సాంబలక్ష్మి, మామిండ్ల మోహన్‌రెడ్డి, దామ సాంబయ్య, పాండవుల రాంబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో గంగమ్మ బోనాలు..

ఖానాపురం : మండలంలోని కొత్తూరులో యాదవ కులస్తులు ఘనంగా గంగమ్మ బోనాల పండుగ నిర్వహించారు. వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, సర్పంచ్ భూస రమఅశోక్‌యాదవ్, బాషబోయిన చంద్రయ్య, రాజు, ఐలయ్య, వీరస్వామి, కుమారస్వామి, భిక్షపతి, రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.



దుగ్గొండి: తొగర్రాయి బీరన్న బోనాల్లో..



నల్లబెల్లి: లెంకాలపల్లిలో..

బీరన్న బోనాల పండుగ

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయి, నాచినపల్లి గ్రామాల్లో బీరన్న బోనాల పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. గొల్ల, కురుమలు ఇళ్లలో బోనాలు అలంకరించి డోలు వాయిద్యాలతో బీరన్న ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, అన్న లక్ష్మణ్, రాజు, సర్పంచ్ ఓడేటి తిరుపతిరెడ్డి, కుల పెద్దలు, మహిళలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం: బోనాలతో వెళ్తున్న యాదవులు



గంగమ్మకు పూజలు చేస్తున్న యాదవ కులస్తులు



నర్సంపేట రూరల్: ముగ్దుంపురంలో..

ఎన్‌సీసీ కేడెట్లకు సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎన్‌సీసీ అధికారులు

నర్సంపేట : భారత సాయుధ దళాల అంతర్భాగంలో ఎన్‌సీసీ కేడెట్ల పాత్ర అమోఘమని, దేశంలోని యువతకు క్రమశిక్షణ, దేశభక్తిగల పౌరులుగా అభివృద్ధి చేయుటలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఎన్‌సీసీ అధికారులు తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్ పదో(టి) బెటాలియన్, వరంగల్ కేడెట్లకు బుధవారం సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ జావేద్ మాట్లాడుతూ.. నేటి విద్యార్థులు రేపటి భావిభారత పౌరులుగా మారి ప్రపంచ దేశాల్లో భారతదేశాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జహంగీర్, థర్డ్ ఆఫీసర్ ఏఎన్‌ఓ ప్రశాంత్‌కుమార్, పీడీ రియాజొద్దీన్, వీరభద్రయ్య, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ కేడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తపాలా బీమా.. ఖాతాదారులకు ధీమా



అవగాహన కల్పిస్తున్న ఎస్‌పీఎం కుమారస్వామి

నల్లబెల్లి : తపాలా శాఖ అమలు చేస్తున్న బీమా పథకంతో ఖాతాదారుల కుటుంబాలకు ధీమా ఇవ్వనుందని నల్లబెల్లి ఎస్‌పీఎం కుమారస్వామి అన్నారు. ఈ మేరకు నల్లబెల్లిలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించి బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాతాదారులకు రూ.399లకే రూ.10లక్షల ప్రమాద బీమా అందిస్తున్నట్లు తెలిపారు. బీపీఎంలు బాబు, మల్లేశం, సురేష్, వెంకట్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.